క్లుప్తంగా

అయోధ్య అక్షతల పంపిణీ



వెంగాపురం రామాలయంలో అక్షతలు పంపిణీ చేసిన అర్చకులు

బలిజిపేట: వెంగాపురం రామాలయంలో భక్తులకు అయోధ్య నుంచి వచ్చిన అక్షతలను శనివారం పంపిణీ చేశారు. ధనుర్మాసం సందర్భంగా ఆలయం వద్ద అక్షతలు, పుస్తకాలను పంపిణీ చేశారు. వీటి ప్రత్యేకత గురించి భక్తులకు అర్చకులు గోపాలకృష్ణ వివరించారు. కార్యక్రమంలో అర్చకులు కె.సూర్యనారాయణ, కె.ఫణికుమార్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు

• జీఐ దేముడుబాబు



సాలూరు: సంక్రాంతి పండగ నేపథ్యంలో ఎవరైనా కోడిపందాలు, పేకాట వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ జి. దేముడుబాబు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సారా, గంజాయి వంటి నిషేధిత మత్తు పదార్థాలు విక్రయించినా, తరలించినా చట్ట ప్రకారం శిక్షిస్తామన్నారు. అలాగే కోడిపందాలు, పేకాట శిబిరాలు నిర్వహించకూడదని తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడిపినా, అల్లర్లు సృష్టించినా చర్యలు తీసుకుంటామన్నారు.

'బడి నుంచి పొలంబడి' వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో పాల్గొన్న రచయితలు

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యతనిస్తూ పూర్వ ప్రాథమిక విద్యాస్థాయి నుంచి ఒకటో తరగతి వరకు విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠ్యాంశాలను గేయాలు, పాటలు, కథలుగా రూపొందేందుకు కృషిచేస్తున్నట్లు జట్టు ట్రస్ట్ నిర్వాహకుడు డా. పారినాయుడు తెలిపారు. జట్టు ట్రస్ట్‌లో 'బడి నుంచి పొలంబడి' ప్రాజెక్టులో భాగంగా పలువురు రచయితలతో శనివారం వర్క్‌షాపు నిర్వహించారు. తెలుగు, ఆంగ్లంలో పాటలు, గేయాలు, కథలను రచించడం ద్వారా ప్రకృతి వ్యవసాయ పాఠాలు దేశం నలుమూలల విస్తృతం చేసేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రచయితలు రౌతు వాసుదేవరావు, బి.భీమేశ్వరరావు, కె.శివకేశవరావు, తదితరులు పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన కల్పించేందుకే..



వికసిత్ భారత్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ రామారావు

గరుగుబిల్లి: కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వాటిని అర్హులకు చేరవేయడమే లక్ష్యంగా వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ ఉరిటి రామారావు తెలిపారు. మండలంలోని మరుపెంట గ్రామంలో శనివారం ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు ఆధ్వర్యంలో యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా వికసిత్ భారత్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ.. పథకాలపై ప్రజలకు మరింత అవగాహన కల్పించేందుకు ఈనెల 25 వరకు మొబైల్ వాహనాల ద్వారా ప్రచారం చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర టీం సభ్యులు గఫూర్, విల్సన్, సర్పంచ్ ఉరిటి నిర్మల, కార్యదర్శి భాస్కరరావు, రామకృష్ణ తదితరులున్నారు.

ఏనుగుల సంచారంపై అప్రమత్తం



తాలాడలో గోడలపై పోస్టర్లు అంటిస్తున్న అటవీశాఖ సిబ్బంది

భామిని: మండలంలోని పలు గ్రామాల్లో ఏనుగుల గుంపు సంచరిస్తుండటంతో అటవీశాఖ అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. ఈ మేరకు శనివారం బాలేరు, సొలికిరి, తాలాడ, ఘనసర, ఘనసర కాలనీ, కీసర, కోసలి, అత్తికొత్తూరు గ్రామాల్లో అటవీశాఖ సిబ్బంది బృందాలుగా ఏర్పడి మైక్‌లో ప్రచారం చేస్తూ ప్రజలను అప్రమత్తం చేశారు. ప్రస్తుతం నాలుగు ఏనుగుల గుంపు వంశధార నదీ తీరంలోని తాలాడ ఐలమ్మ తోట పరిసరాల్లో సంచరిస్తున్నట్లు తెలిపారు. ఏనుగులను కవ్వించడం, రెచ్చగొట్టడం వంటివి చేయొద్దని ఎఫ్‌బీఓలు లక్ష్మణమూర్తి,లక్ష్మీనారాయణ కోరారు. పండగకు వచ్చే బంధువులు, స్నేహితులను ఈ మేరకు అప్రమత్తం చేయాలని సూచించారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

• ఏపీ టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్



అంటిపేట కోనేరు గట్టుపై మొక్కలు నాటుతున్న ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

సీతానగరం: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. దీన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పేర్కొన్నారు. మండలంలోని అంటిపేట గ్రామానికి చెందిన యూత్ సభ్యుల ఆధ్వర్యంలో మంచినీటి కోనేరు అభివృద్ధి పనులు, మొక్కలు నాటే కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటిన మొక్కలను సంరక్షించినపుడే పర్యావరణ పరిరక్షణ సాధ్యమన్నారు. దశాబ్దాల కిందట గ్రామస్తులు నిర్మించిన మంచినీటి కోనేరు గట్టు శిథిలావస్థకు చేరడంతో తరచూ నీరు కలుషితం కావడం వల్ల యూత్ సభ్యులు కోనేరు గట్టు అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. యూత్ సభ్యులను ప్రోత్సహిస్తూ తమ వంతు సహకారంగా ఫల మొక్కలను, ప్రజలకు నీడనిచ్చే మొక్కలను సొంత నిధులతో సమకూర్చుతానని ఇచ్చిన హామీ మేరకు మొక్కలు పంపిణీ చేసినట్టు తెలిపారు.

గ్రామాల్లో యూత్ సభ్యులు చేస్తున్న సేవా కార్యక్రమాల్లో తమ వంతు సహకారాన్ని అందించనున్నట్టు పేర్కొన్నారు. ఈ నెల 19న విజయవాడలో జరగనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో యూత్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు



మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: సంక్రాంతి పండుగ నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను మంత్రి పీడిక రాజన్నదొర ఆదేశించారు. శనివారం తన స్వగృహంలో మున్సిపల్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టడంతో పాటు తాగునీరు క్రమం తప్పకుండా అందించాలన్నారు. అలాగే వీధిదీపాలు సక్రమంగా వెలగాలని, ఎక్కడైనా పాడైతే వెంటనే మరమ్మతులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఫకీర్‌రాజ్, గౌరీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

లచ్చయ్యపేటలో ఇంటింటి కుళాయిలతో తాగునీరు



కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేట గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే అలజంగి జోగారావు చొరవ తీసుకోవడంతో గ్రామంలో ఇంటింటికి తాగునీరు అందుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పవన్‌కుమార్ తెలిపారు. శనివారం గ్రామంలో నీటి సరఫరాను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామంలో లక్షల రూపాయిల వ్యయంతో 105 ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేయడంతో పాటు ఓవర్ హెడ్‌ట్యాంక్ నిర్మాణం జరిగిందన్నారు. గ్రామంలో కుళాయిల నిర్మాణం పనులు పూర్తి కావడం వలన పాత వాటర్ ట్యాంక్ నుంచి కుళాయిలకు నీరు విడుదల చేసినట్టు తెలిపారు.

మంచు కురిసే వేళలో..



వీరఘట్టం రహదారిలో కురుస్తున్న పొగమంచు

పాలకొండ రూరల్:

పట్టణంతో పాటు పరిసర గ్రామాలపై శనివారం మంచు దుప్పటి పరచుకుంది. ఉదయం 8 గంటల వరకు పొగమంచు దట్టంగా కురవడంతో ప్రజలు, వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. సీతంపేట, శ్రీకాకుళం, వీరఘట్టం రహదారుల్లో అలుముకున్న మంచు మబ్బులు చూపర్లను ఆకట్టుకున్నాయి.



పట్టణాన్ని మింగేసినట్టు కనిపిస్తున్న దట్టమైన పొగమంచు

వెంకన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



స్వామివారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామివారిని, పద్మావతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వీవీ అప్పలాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాత సేవ, మంగళాశాసనం, శాత్తుమురై, తీర్థఘోష్టి, బాలభోగం, పుణ్యాహవాచనం, తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం మండలంలోని దళాయివలసకు చెందిన గులిపల్లి శ్రీనివాసనాయుడు, నారాయణమ్మ దంపతుల సహకారంతో ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. శ్రీరామ భజన మండలి సభ్యులు స్వామివారిని కీర్తిస్తూ భజన గీతాలు ఆలపించారు. భోగి పండగ, ధనుర్మాస ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం ఆలయంలో గోదాదేవి కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మఠ్రాపు సత్యనారాయణ, కమిటీ సభ్యులు తెలిపారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు



రాజాం సిటీ: పింఛన్లు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ నర్సింహులు

రాజాం సిటీ: అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని జెడ్పీటీసీ బండి నర్సింహులు అన్నారు. మండలంలోని పెనుబాక గ్రామంలో పలువురికి కొత్తగా మంజూరైన పింఛన్లు శనివారం పంపిణీ చేశారు. ప్రతీ ఒక్కరి కళ్లల్లో ఆనందం చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా ప్రభుత్వ పాలన కొనసాగుతోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.బోడెమ్మ తదితరులు పాల్గొన్నారు.

రాజాం: మండలంలోని గాత్రాజుచీపురుపల్లిలో కొత్తగా మంజూరైన పింఛన్లను ఎంపీటీసీ ధర్మాన పద్మావతి, సచివాలయ కన్వీనర్ పొన్నాడ సన్యాసినాయుడు చేతులమీదుగా లబ్ధిదారులకు అందజేశారు.

ఇంటింటికీ అయోధ్య అక్షతలు



రాజాం: మారేడుబాకలో అక్షతలు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ వెంకటేష్

రాజాం: అయోధ్య రామమందిరం ప్రారంభోత్సవం పురస్కరించుకుని, మండలంలోని మారేడుబాక, కొత్తవలస గ్రామాల్లో రాముడికి పూజ చేసిన అక్షతలను శనివారం పంచిపెట్టారు. వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, గ్రామానికి చెందిన శ్రీరామ భజన బృందం భక్తులు ఇంటింటికీ వెళ్లి, అక్షతలు అందజేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

మెంటాడ: మండలంలోని చల్లపేటలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ తాడ్డి రామచంద్రరావు మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో శతశాతం మౌలిక సదుపాయాలు కల్పించడమే యాత్ర ప్రధాన ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తివిక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి పోటీలు

రాజాం: మండలంలో జరుగుతున్న మండల స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు శనివారంతో ముగిశాయి. కబడ్డీ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన జట్టు నియోజకవర్గ స్థాయిలో జరిగే పోటీలకు అర్హత సాధించినట్లు ఎంపీడీవో బాసూరి శంకరరావు తెలిపారు.

దుస్తుల వితరణ

తెర్లాం: మండలంలోని పాములవలస, ఆమిటి గ్రామాల్లోని పలువురు నిరుపేదలకు రాజాం జీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం దుస్తులు వితరణ చేశారు. కార్యక్రమంలో జీఎంఆర్ ఫౌండేషన్ ప్రతినిధి కొల్లి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

తెట్టంగిని ఆదర్శంగా తీర్చిదిద్దాం..

• రూ.2.93 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం..
• ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్



తెట్టంగిలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

వీరఘట్టం: మండలంలోని తెట్టంగి గ్రామానికి ఎంతో చారిత్రక గుర్తింపు ఉందని, ఈ గ్రామంలో సుమారు రూ.2.93 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2017 సెప్టెంబరు 11న గ్రామానికి అప్పటి సీఎం చంద్రబాబునాయుడు వచ్చి అనేక హామీలు ఇచ్చారని, కానీ ఏ ఒక్కటీ నెరవేర్చకుండా ఇక్కడి ప్రజలను మోసం చేశారని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక తెట్టంగి గ్రామం ప్రగతి పథంలో దూసుకుపోతోందన్నారు. గ్రామంలో రూ.80 లక్షలతో గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్‌ను నిర్మించినట్లు చెప్పారు. రూ.61 లక్షలతో సీసీరోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టులు నిర్మించామన్నారు. అలాగే జలజీవన్ మిషన్ నిధులు రూ.9.50 లక్షలతో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేశామని, ఆర్‌సీఎం చర్చ్‌వీధి, సీబీఎం చర్చివీధి, బంగారుతల్లి వీధితో పాటు పలు శ్మశాన వాటికల్లో రూ.3.65 లక్షలతో బోరుబావులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సుమారు కోటి రూపాయలతో పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందించామని, గడపగడపకు కార్యక్రమంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీఎం సహాయ నిధి నుంచి గ్రామానికి చెందిన నలుగురికి వైద్యఖర్చుల కోసం రూ.1.60 లక్షలు అందించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు, సర్పంచ్ అలజంగి విజయమ్మ, ఎంపీటీసీ సతివాడ వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు పరిసినాయుడు, సతివాడ చిన్నంనాయుడు, కర్రి గోవిందరావు, శిష్టు మధుసూదనరావు, వైశ్యరాజు గోవిందరాజు, పాలవలస ధవళేశ్వరరావు, నీలం సత్యంనాయుడు, రణస్థలం రాంబాబు పాల్గొన్నారు.

స్వామి వారికి తిరువీధి



బగ్గందొరవలసలో వేణుగోపాలస్వామిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సీతానగరం, బగ్గందొరవలస, కేఎస్ పురం, కృష్ణారాయపురం, లచ్చయ్యపేట, బక్కుపేట గ్రామాల్లో వేణుగోపాల, వెంకటసత్యనారాయణ, రామాలయాల్లో శనివారం పూజలు జరిగాయి. బగ్గందొరవలసలో స్వామివారిని అర్చకులు ఆధ్వర్యంలో గోవింద మాలాధారణ చేసిన భక్తులు పల్లకిలో అధిష్ఠించి ఊరేగించారు. వేణుగోపాలస్వామి ఆలయంలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు నగర సంకీర్తన, మేల్కొలుపు, భజన పాటలతో తిరువీధి నిర్వహించారు. అనంతరం వేణుగోపాలస్వామి, గోదాదేవి అమ్మవార్లకు పూజలు నిర్వహించారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు



గెడ్డలుప్పి గ్రామ కాలువల్లో పూడికలు తీయిస్తున్న సర్పంచ్ అల్లు తిరుపతిరావు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో సర్పంచ్‌ల పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేయిస్తున్నారని ఈఓపీఆర్‌డీ కె.కుమారవర్మ అన్నారు. గెడ్డలుప్పి, పెదబోగిలి మేజరు పంచాయతీల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఇప్పటికే లచ్చయ్యపేట, జోగింపేట బగ్గందొరవలస, చినబోగిలి, పణుకుపేట గ్రామాల్లో పారిశుద్ధ్య పనులను నిర్వహించడం జరిగిందన్నారు. తాజాగా గెడ్డలుప్పి, పెదబోగిలి, సీతానగరం గ్రామాల్లో పంచాయతీ పాలకులు పారిశుద్ధ్య పనులు నిర్వహించడం జరుగుతోందన్నారు. కాలువల్లో పూడికలు తీసిన పెదబోగిలి గ్రామంలో వీధుల్లో బ్లీచింగ్ పౌడరును వేయించినట్టు తెలిపారు. గెడ్డలుప్పి సర్పంచ్ అల్లు తిరుపతిరావు ఆధ్వర్యంలో కాలువల్లో పూడికలు తీయడంతో పాటు దోమల నివారణకు అవసరమైన మందులను చల్లిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీ సీహెచ్‌ఓ ఎస్‌వీ రమణ, వైద్య సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

'హెల్పింగ్ హ్యాండ్స్' సాయంతో..



శ్లాబ్ వేయిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సంఘం సభ్యులు

గుమ్మలక్ష్మీపురం: సీఆర్పీగా పనిచేస్తూ అనారోగ్యంతో అకాలమరణం పొందిన గుమ్మలక్ష్మీపురం గ్రామం కొండవీధికి చెందిన కిల్లక రవికుమార్ సొంతింటి కల సాకారానికి స్థానిక హెల్పింగ్ హ్యాండ్స్ సంఘం బాసటగా నిలిచింది. నిరుపేద అయిన రవికుమార్ సీఆర్పీగా తనకు వచ్చే జీతంతో సొంతిల్లు కట్టుకోవాలని కలలు కన్నాడు. అయితే ఆరు నెలల కిందట ఆయన మరణించడంతో సొంతింటి పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అయితే అందరితో ఎంతో కలివిడిగా ఉన్న రవికుమార్ సొంతింటి కలను సాకారం చేయాలని గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు భావించారు. సుమారు రూ.1.30 లక్షలు విరాళాలు సేకరించి నిర్మాణ పనులు పునఃప్రారంభించారు. త్వరలోనే ఆ ఇంటిని రవికుమార్ కుటుంబీకులకు అప్పగించనున్నట్లు వారు తెలిపారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



పాలకొండ: శివప్రసాద్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్, తదితరులు



కురుపాం: మంతినివలసలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

కురుపాం: మండల కేంద్రంలోని ప్రదీప్‌నగర్ కాలనీకి చెందిన దాసరి మహాలక్ష్మి(85), మంతినివలసకు చెందిన కాకుల పద్మ(35) ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి శనివారం పరామర్శించారు. మృతుల కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట కురుపాం సర్పంచ్ గార్ల సుజాత, ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ గొర్లి సుజాత, ఎంపీటీసీలు సంతోషిరాణి, వెలమల బంగారునాయుడు, మాజీ వైస్ ఎంపీపీ వంజరాపు కృష్ణ, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు అంధవరపు కోటేశ్వరరావు, ఉప సర్పంచ్ ఆదిల్, ఆకుల శ్రీధర్ పాల్గొన్నారు.

కొమరాడ: మండలంలోని గుణానపురం గ్రామ సర్పంచ్ మిరయాల పద్మావతి భర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు మిరయాల సత్యనారాయణ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి శనివారం ఆ గ్రామానికి వెళ్లి సత్యనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. పార్టీ తరపున ఆ కుటుంబానికి అండగా ఉంటామని, అధైర్య పడొద్దని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పరామర్శ

పాలకొండ: మండలంలోని అర్థలి గ్రామ మాజీ సర్పంచ్ నల్లి కృష్ణంనాయుడు ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ శనివారం అర్థలి గ్రామానికి వెళ్లి కృష్ణంనాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన కుమారులు నల్లి శివప్రసాద్ (నాగవంశపు కార్పొరేషన్ డైరెక్టర్), నల్లి ధర్మారావు (సీనియర్ జర్నలిస్ట్)లను పరామర్శించి ఓదార్చారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కనపాక సూర్యప్రకాశరావు, పాలవలస ధవళేశ్వరరావు, కోరాడ రవికుమార్, తదితరులు ఉన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



పల్లవిని అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు, తదితరులు

విజయనగరం టౌన్: వెయిట్ లిఫ్టింగ్‌లో కళాశాల విద్యార్థిని పల్లవి అద్భుతమైన ప్రతిభ కనబరచడం ఎంతో ఆనందంగా ఉందని, రానున్న రోజుల్లో ఆమె ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సీతం విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు ఆకాంక్షించారు. ఈ మేరకు కళాశాల ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడుతూ.. ఇంటర్నేషనల్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన జాతీయ సీనియర్, జూనియర్ విభాగాల్లో పల్లవి పాల్గొని 64 కిలోల విభాగంలో రజతం, కాంస్య పతకాలు సాధించిందన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ అధికారిణి కెప్టెన్ ఎం.సత్యవేణి, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ చల్లా రాము, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని అభినందనలు తెలిపారు.